ఏడీఆర్‌ఎంలో నేడు థైరాయిడ్ ఉచిత వైద్య శిబిరం

రామంతాపూర్ : శారదానగర్ ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత థైరాయిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి డైరెక్టర్ తెలిపారు. వివరాలకు 9676454044 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

రామంతాపూర్ : నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో సోమవారం క్యాబినెట్ ఇన్వలేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా హెడ్ భాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా ఎంపికైన వారికి స్కూల్ జీఎం గోపాల్‌రెడ్డి బ్యాడ్జీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఏటీఎం బాల పరమేశ్వర్, ప్రిన్సిపాల్ సరిత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులను ప్రారంభించండి

బోడుప్పల్: చిలుకానగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలోని కట్ట మైసమ్మ వైన్ షాపు వద్ద ఉన్న కల్వర్టు పనులను వెంటనే ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కల్వర్టు చిన్నగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కల్వర్ట్ పనుల కోసం రూ. 50 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో కార్పొరేటర్ చీరాల నర్సింహ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మల్లాపూర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నపూర్ణ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ సిటీజన్స్‌కు మొబైల్ మెడికేర్ యూనిట్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాయింట్ కన్వీనర్ రమేష్, ఉపాధ్యక్షులు రవికుమార్, పీఎస్ఎన్ చౌదరి, కాలనీ అధ్యక్షులు భానుచందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, స్థానికులు యాస కృష్ణారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అల్వాల్: పేదల కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ జితేంద్రనాథ్ అన్నారు. సోమవారం వడ్డెర సంఘం నాయకుల విజ్ఞప్తి మేరకు డివిజన్ పరిధిలోని జ్యోతికాలనీ, ఎంహెచ్‌ఆర్ కాలనీ, జొన్నబండ కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొండయ్య, శ్రీశైలం, వెంకటేష్, మహేష్‌కుమార్, పాషా, బాలక్రిష్ణ, రామకృష్ణ, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం

ఉప్పల్: ఉప్పల్‌లో దళితులపై దాడి అమానుషమని ఎస్సీ సెల్ చైర్మన్ మోహన్ అన్నారు. 15 రోజుల క్రితం ఫ్లెక్సీ వివాదంలో దళితుడైన నరేష్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో దళిత సంఘాల నేతలతో కలిసి విలేకరుతో మాట్లాడారు. రాజకీయంగా ఎదుగుతున్న నరేష్‌ను భయభ్రాంతులకు గురి చేసేందుకే దాడి చేశారని ఆయన ఆరోపించారు. 15 రోజులు గడుస్తున్నా పోలీసులు నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదో స్పష్టం చేయాలన్నారు. ఇప్పటికీ పోలీస్ వ్యవస్థపై తమకు నమ్మకం ఉన్నందునే ఆందోళనలు చేయలేదని దళితులపై వివక్ష చూపితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌల్లూరి ప్రభాకర్, రాకేష్, అనిల్, ప్రేమ్, అరిఫ్, బాలు, ప్రసాద్, నాగరాజు, అరుణ్, వనీత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డికాలనీలో కార్పొరేటర్ పర్యటన

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీలో సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో నిర్మించనున్న డ్రైనేజీ వ్యవస్థపై అధికారులతో చర్చించారు.జాతీయజెండాల పంపిణీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కార్పొరేటర్ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తన ఇంటిపై జాతీయజెండా ఏర్పాటు చేసి విధిగా ప్రతి ఒక్కరు జాతీయ జెండాలను ఇళ్లపై ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, ముత్యాలు, కనకయ్య, నజీర్, గోపి, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

బోడుప్పల్: ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని సీపీఐ మేడిపల్లి మండల ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వేనంబర్ 63/28 నుంచి 63/39 వరకు గల ప్రభుత్వ భూమిలో కోర్టు ఆర్డర్ పేరుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, బీకెఎంయు మండల అధ్యక్షులు భూతం ఐలయ్య, ఇందిరానగర్ శాఖ కార్యదర్శి మాచర్ల కనకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ హిల్స్ కాలనీ నూతన కార్యవర్గం ఏర్పాటు

బోడుప్పల్: 21 డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ కాలనీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాములు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, చైర్మన్‌లుగా ధర్మా నాయక్, రామరాజు, ఉపాధ్యక్షులుగా నారాయణ నాయక్, శంకర్ నాయక్, శైలేంద్ర పాటిల్, జయరాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, సంయుక్త కార్యదర్శులుగా హరి నాయక్, రమణ మూర్తి, గోపాల్‌రెడ్డి, మహేష్, కోశాధికారిగా కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సునీల్, సలహాదారులుగా బలరాం నాయక్ ఎన్నికయ్యారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ భూక్యా సుమన్‌నాయక్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాప్రా: గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన గాంధీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం సంబంధిత అధికారులకు నివేదించారు. గతంలో యూజీడీ కోసం తవ్వి వదిలేసిన సీసీ రోడ్లను పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. న్యూగాంధీనగర్, ఓల్డ్‌గాంధీనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మహేష్, కొండల్‌గౌడ్, సత్యనారాయణ, యాదగిరి, సత్తయ్య, దశరథ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందించాలి

బోడుప్పల్: విద్యార్థుల్లో చదువుతోపాటు దేశభక్తిని పెంపొందించాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర సమర యోధుల వేషాధారణలో అలరించారన్నారు. స్వాతంత్ర సమర యోధుల వీర గాథలను అందరు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల నృత్యాలు, దేశ భక్తి గీతాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: పవిత్ర పుణ్యక్షేత్రం యాదాద్రికి వెళ్లేందుకు ఆర్టీసీ కల్పించిన బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ నుంచి యాదాద్రికి కుషాయిగూడ డిపో అధికారులు ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును సోమవారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. హెచ్‌బీకాలనీ అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ప్రారంభమయ్యే బస్సు కీసర, తుర్కపల్లి మీదుగా యాదాద్రి చేరుకుంటుందన్నారు. ప్రతిరోజు మూడు ట్రిప్పులు నడుస్తుందని తెలిపారు. యాదాద్రికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ చొరవతో ఈ బస్సు సర్వీసు అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, సూపరిండెంట్ బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నేతలు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బోదాసు రవి, మల్లారెడ్డి, గడియారం రామకృష్ణ, నవీన్‌గౌడ్, బాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మెల్యే పాదయాత్ర

కాప్రా: నమస్తే ఉప్పల్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి చేపట్టి పాదయాత్ర 26వ రోజుకు చేరింది. సోమవారం డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. వృద్ధులు, యువత, కాలనీ అసోసియేషన్ సభ్యులను పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి, నాయకులు కుమారస్వామి, పార్టీ కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'యువతకు అండగా ఉంటా'

కుషాయిగూడ: యువతకు ఉన్నత చదువుతో పాటుగా ఉపాధి కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చక్రిపురంలో సోమవారం నిర్వహించిన బీఎల్‌ఆర్ యూత్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే లక్ష్యానికి చేరువవుతారన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఆర్థిక పేద విద్యార్థులకు తన వంతుగా చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత చదువులు, ఉపాధి కోసం విదేశాలకు పంపుతున్నామన్నారు. త్వరలోనే ఉప్పల్ నియోజకవర్గ వ్యాప్తంగా జాబ్‌మేళాను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్, జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నేతలు రాఘవరెడ్డి, యాదిరెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్‌లో సోమవారం ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ శంకర్‌కు ఇద్దరు యువకులు అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దూల్‌పేట నుంచి కొనుగోలు చేసి తీసుకు వచ్చిన గంజాయిని సేవించడంతోపాటు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితులను ఉప్పల్ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన నయనమ్ సుదీర్ కుమార్, పటేల్ నగర్‌కు చెందిన షేక్ ఇంతియాజ్‌గా గుర్తించిన పోలీసులు వారి నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.